నమస్తే తెలంగాణ

# వరంగల్

5 | వరంగల్, ఆదివారం 5 జనవరి 2025 | WARANGAL



లక్నవరం సరస్సుపై ఉయ్యాల వంతెన, (ఇన్‌సెట్) దేవునిగుట్టపై ఉన్న పురాతన ఆలయం

- రోజు రోజుకూ పెరుగుతున్న దౌర్జన్యాలు
- పేదల అవసరాలే ఆసరాగా అధిక వడ్డీకి రుణాలు
- కిస్తీలు కట్టాలంటూ తీవ్రమైన వేధింపులు
- ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్న దారుణాలు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు
- ఉమ్మడి వరంగల్‌లో నలుగురి బలవన్మరణం

**గ్రామాల్లో మళ్లీ మైక్రో ఫైనాన్స్** (సూక్ష్మ వడ్డీ వ్యాపారం) పడగవిప్పుతున్నది. పదేళ్ల క్రితం పేద కుటుంబాలను చిన్నాభిన్నం చేసిన సంస్థలు తమ కార్యకలాపాలు తాజాగా మొదలుపెట్టాయి. పేద ప్రజల అవసరాలే ఆసరాగా అధిక వడ్డీలకు రుణాలిచ్చి వారి నడ్డి విరుస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేలాది కుటుంబాలు కిస్తీలు చెల్లించలేక సతమతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపులు తీవ్రమవుతున్నాయి. దీంతో అప్పులు కట్టలేక.. రోజు రోజుకూ పెరుగుతున్న వారి ఆగడాలను తట్టుకోలేక పలువురు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. *- సుబేదారి, జనవరి 4*





# మళ్లీ మైక్రో పడగ

## గ్రామాల్లో రెచ్చిపోతున్న ఫైనాన్స్ సంస్థలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో టాటా, ఐఐఎఫ్ఎల్, బంధన్, ఫిన్‌కేర్, ఆర్మన్, ఆధార్‌తోపాటు అనేక మైక్రో ఫైనాన్స్ సంస్థలు పేద, సామాన్య ప్రజల ఆర్థిక అవసరాలను టార్గెట్‌గా చేసుకుంటున్నాయి. గృహ నిర్మాణాలు, పిల్లల చదువు, పంట పెట్టుబడి, ఉపాధి రంగాల పేరుతో అధిక వడ్డీకి రుణాలిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొన్ని సంస్థలు వ్యక్తిగతంగా, మరి కొన్ని గ్రూప్‌ల పేరుతో ఎక్కువగా మహిళలను లక్ష్యంగా చేసుకొని నెల, వారం కిస్తీలుగా రూ. 10 లక్షల వరకు లోన్లు ఇస్తున్నారు. రెండు, మూడు కిస్తీలు కట్టకుంటే ఇళ్ల ముందుకు వచ్చి బూతులు తిడుతూ 'చస్తే చావండి.. మాకు మాత్రం డబ్బులు కట్టండి' అంటూ రెచ్చిపోతున్నారు.

***10 నుంచి 20 శాతం వడ్డీ***

ప్రభుత్వ రంగ బ్యాంకులు చిన్న తరహా రుణాలివ్వకపోవడం, లోను కోసం ఆస్తుల గ్యారెంటీ, ష్యూరిటీల నిబంధనలు పెట్టడంతో పేద ప్రజలు తక్షణావసరాల కోసం మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. ఈ



నేపథ్యంలో ఆ సంస్థలు రూ. 10 వేల నుంచి రూ. 10 లక్షలు ఆపైన రుణాలిస్తూ 10 నుంచి 20 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాయి. రుణాలను బట్టి కిస్తీలు కట్టేందుకు వారం, పదిహేను, నెల రోజుల వ్యవధి ఇస్తూ వడ్డీతో సహా కట్టించుకుంటున్నాయి. ఇలా రూ. 20 వేలు తీసుకుంటే మూడు నెలల్లో రూ. 25 వేలు చెల్లించాల్సి వస్తుంది. ఒకవేళ రెండు, మూడు కిస్తీలు చెల్లించని పక్షంలో సిబ్బంది ఇళ్లపైకి రావడం, బెదిరింపులకు పాల్పడడం, డబ్బులు కట్టే వరకు కదిలేది లేదంటూ తీవ్రంగా వేధిస్తున్నారు. వీటిని తట్టుకోలేక పలువురు ఆత్మహత్య చేసుకుంటున్నారు. వారి నుంచి తప్పించుకునేందుకు ఊరు మారినా అక్కడికి వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

***నెల రోజుల్లో నలుగురు బలవన్మరణం..***

మైక్రో ఫైనాన్స్ సంస్థల ఒత్తిడితో ఉమ్మడి వరంగల్ జి



ఆత్మహత్యకు పాల్పడిన మైక్రోఫైనాన్స్ బాధిత దంపతులు

ల్లాలో నెల రోజువ వ్యవధిలోనే నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో ఇద్దరు దంపతులున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కమలాపూర్ గ్రామ పరిధి మంజినాయక్ తండాకు చెందిన భార్యాభర్తలు పలు మైక్రో సంస్థల నుంచి రూ. 3 లక్షల వరకు రుణం తీసుకున్నారు. వారానికి రూ. 200 చొప్పున చెల్లించాల్సి ఉండగా, కుటుంబ సభ్యుల అనారోగ్యంతో వాటిని కట్టలేకపోయారు. దీంతో ఆయా సంస్థల సిబ్బంది ఇంటికి వచ్చి వేధించడంతో పాటు తోటి గ్రూప్ సభ్యులు కూడా ఒత్తిడి చేయడంతో డిసెంబర్ 6న బానోత్ చందన (32) పురుగుల మందు తాగగా చికిత్స కోసం ఎంజీఎంలో చేర్పించారు. భార్య పరిస్థితిని చూసి భర్త దేవేందర్ (37) గత నెల 20న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చే సుకున్నాడు. నాలుగు రోజుల క్రితం చందన చికిత్స పొందుతూ మృతి చెందగా ఇద్దరు కుమారులు అనాథలయ్యారు.

***జనగామలో వివాహిత..***

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన అంగడి ఎలేంద్ర (35) గృహ నిర్మాణం కోసం ఆధార్‌హౌస్ మైక్రో ఫైనాన్స్ సంస్థ నుంచి రూ. 15 లక్షల అప్పు తీసుకుంది. రెగ్యులర్‌గా కిస్తీలు చెల్లించినప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో మరికొన్ని కట్టలేకపోయింది. దీంతో ఆ సంస్థ నోటీసులు ఇవ్వడంతో పాటు ఇంటికి వచ్చి వేధించడంతో హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఎల్కుర్తిలోని తల్లిగారింటికి వచ్చి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

***వంగపల్లిలో యువకుడు..***

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లికి చెందిన ఆకునూరి రాకేశ్ (30) ఆర్మాన్ మైక్రోఫైనాన్స్ నుంచి రూ. 75 వేలు రుణం తీసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో నాలుగు నెలల కిస్తీలు చెల్లించకపోవడంతో సంస్థ సిబ్బంది ఇంటికి వచ్చి వేధించడంతో తట్టుకోలేని రాకేశ్ కుటుంబంతో అన్న నివాసం ఉంటున్న అదే మండలంలోని గూడూరుకు వెళ్లాడు. అక్కడికి కూడా వచ్చి ఫైనాన్స్ సిబ్బంది వేధించడంతో రాకేశ్ డిసెంబర్ 31న గుండెపోటుతో మృతి చెందాడు. ఇంత జరుగుతునా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని, మైక్రో ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలి



ఉమ్మడి రాష్ట్రంలో 2011వరకు మైక్రో ఫైనాన్స్ సంస్థలు పేదల ప్రజలకు అధిక వడ్డీకి రుణాలిచ్చి వారి కుటుంబాలను చిన్నాభిన్నం చేశాయి. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల పోరాటంతో అప్పటి రోశయ్య ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్ రెగ్యులేటర్ యాక్ట్ తీసుకొచ్చి నియంత్రించింది. పదమూడేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో పేదలకు అధిక వడ్డీకి రుణాలిస్తూ ఆర్థిక భారం మోపుతున్నాయి. కిస్తీలు కట్టలేక, వేధింపులు భరించలేక ఇప్పటికే ఉమ్మడి వరంగల్‌లో నలుగురు చనిపోగా అనేక చోట్ల పలువురు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మైక్రోఫైనాన్స్ సంస్థలను నియంత్రించేందుకు రెగ్యులేటర్ యాక్ట్ తీసుకొచ్చి పటిష్టంగా అమలు చేయాలి. పేద ప్రజలు ఆత్మహత్య చేసుకోకుండా చూడాలి. లేదంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తాం. *– కూరపాటి వెంకటనారాయణ, రిటైర్డ్ ప్రొఫెసర్*



రామప్ప దేవాలయం

**ములుగు జిల్లా అందాలకు సందర్శకుల ఫిదా**

# పర్యాటకం.. ఆదాయం ఘనం

**ఆహ్లాదకరమైన వాతావరణం..** ఆధ్యాత్మిక కేంద్రాలతో ములుగు జిల్లా పర్యాటక పరంగా పరిఢవిల్లుతున్నది. ఇక్కడి ప్రకృతి రమణీయత దేశ, విదేశాల సందర్శకులను కట్టిపడేస్తున్నది. దీంతో జిల్లాకు వచ్చే పర్యాటకుల సంఖ్య ఏటా పెరుగుతున్నది. అడవులు, ఆలయాలు, జలపాతాలు, సరస్సులతో అలరారుతున్న ఈ ప్రాంతం విశేషంగా ఆకట్టుకుంటున్నది. జిల్లా ప్రారంభంలో ఉండే ఆది దేవత గట్టమ్మ నుంచి చివరన ఉండే బొగత, ముత్యంధార జలపాతం వరకు ప్రతి ప్రాంతం ప్రత్యేకతను సంతరించుకున్నది. ప్రతి రోజు వచ్చిపోయే టూరిస్టులతో కళ కళ లాడుతున్నది. ఫలితంగా ప్రభుత్వానికి కోట్లల్లో ఆదాయం సమకూరుతున్నది. *- ములుగు, జనవరి 4 (నమస్తే తెలంగాణ)*



తాడ్వాయి మండలం అటవీ ప్రాంతంలో ఇటీవల నిర్మించిన బ్లాక్‌బెర్రీ ఐలాండ్‌లోని గుడారాలు

- ఏటా పెరుగుతున్న పర్యాటకుల రాకపోకలు
- ఆకర్షిస్తున్న ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు
- ఆసక్తి చూపుతున్న దేశ, విదేశాల ప్రజలు
- గతేడాది తరలివచ్చిన 1.71 కోట్ల మంది..
- సమకూరిన ఆదాయం రూ. 19.60 కోట్లు..
- ప్రతి ప్రాంతానిదీ కట్టి పడేసే ప్రత్యేకత

## ప్రతి ప్రాంతానికి ప్రత్యేకత..

ప్రకృతి అందాలను తనలో ఇనుమడించుకున్న ములుగు జిల్లాలోని ప్రతి ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. పరుగులు పెట్టే వాగులు, వంకలు.. పక్షుల కిలకిల రావాలు.. ఎత్తైన పచ్చని కొండలు.. పాలనురగల జలపాతాలు.. ఏడాది పొడవునా నీటితో కళకళలాడే సరస్సులు, జలాశయాలు, కాకతీయులు నిర్మించిన ఆలయాల్లోని అద్భుత శిల్పాలు, భక్తి భావాన్ని పెంపొందించే పుణ్య క్షేత్రాలు పర్యాటకులు, భక్తులను కట్టి పడేస్తున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆహ్లాదకరమైన వాతావరణం విస్తరించి ఉన్న ములుగు జిల్లాను వీక్షించేందుకు వచ్చే వారి సంఖ్య పెరుగుతూ వస్తున్నది. తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం (నూగూరు) మండలాల్లోని అడవులు, వాగులు, వంకలు, ముళ్లకట్ట బ్రిడ్జి ప్రకృతి పరంగా ఆకర్షిస్తున్నాయి. వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయంతో పాటు తాడ్వాయిలోని మేడారం, మంగపేటలోని మల్లూరు లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం ఆధ్యాత్మికంగా విశేష గుర్తింపు పొందాయి. పర్యాటక పరంగా రామప్ప, లక్నవరం జలాశయం, తాడ్వాయి అడవులతో పాటు అదే మండలంలోని ఆది మానవుల సమాధులు, నిత్యం మొక్కులు అందుకునే ములుగులోని ఆది దేవత గట్టమ్మ దేవాలయం, కొత్తూరు దేవునిగుట్ట, నిత్యం ఫొటో, వెడ్డింగ్ షూట్లతో అలరారుతున్న జాకారంలోని కాకతీయుల దేవాలయం, వాజేడులోని బొగత, వెంకటాపురం(నూగూరు)లోని ముత్యంధార జలపాతాలు ప్రాచుర్యం పొందాయి. ఇటీవల తాడ్వాయి అటవీ ప్రాంతంలో బ్లాక్ బెర్రీ ఐలాండ్‌ను అభివృద్ధి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సులో 3వ ఐలాండ్‌ను నూతన హంగులతో అభివృద్ధి చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గట్టమ్మ ఆలయం, తాడ్వాయి మండల కేంద్రం, ముళ్లకట్ట బ్రిడ్జి, మల్లూరులో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అధునాతన హంగులతో అతిథి గృహాలను నిర్మించింది. పర్యాటకులు ఆన్‌లైన్‌లో ములుగు జిల్లా ఖ్యాతిని తెలుసుకుంటూ పర్యాటక ప్రాంతాలు, దేవాలయాల సందర్శనకు విచ్చేస్తున్నారు.



ముళ్ళకట్ట బ్రిడ్జి



వాజేడు మండలంలోని బొగత జలపాతం

ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక కేంద్రాలతో ములుగు జిల్లా పర్యాటకులు, భక్తులను విశేషంగా ఆకర్షించింది. గతేడాది పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో ప్రభుత్వానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీ ఆదాయం సమకూరింది. గడిచిన 12 నెలల కాలంలో 1,71,51,185 మంది భక్తులు, పర్యాటకులు ములుగు జిల్లాకు రాగా వారి నుంచి రూ.19.60 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఫిబ్రవరిలో నిర్వహించిన సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు 1,50,11,000 మంది భక్తులు హాజరు కాగా, ప్రతి శని, ఆదివారాలతో పాటు సెలవు దినాల్లో వచ్చిన వారితో రూ. 14 కోట్ల ఆదాయం లభించింది. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలోని శిల్ప సంపదను వీక్షించేందుకు దేశ విదేశాల నుంచి వచ్చిన 8,04,600 మంది భక్తులతో రూ. 35 లక్షలు సమకూరాయి. రాష్ట్రంలోనే తొలిసారి ఉయ్యాల వంతెనను ఏర్పాటు చేసిన లక్నవరం సరస్సు అందాలను చూసేందుకు 5,46,411 మంది పర్యాటకులు విచ్చేయగా రూ. 4.12 కోట్ల ఆదాయం వచ్చింది. తెలంగాణ నయాగరగా పేరొందిన బొగత జలపాతాన్ని వీక్షించేందుకు 6,18,730 మంది రాగా అటవీ శాఖకు రూ. 25 లక్షల ఆదాయం సమకూరింది. మంగపేట మండలంలోని మల్లూరు గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని 1,70,444 మంది భక్తులు సందర్శించగా రూ. 88 లక్షల ఆదాయం వచ్చింది.



మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం

వెంకటాపురం (నూగూరు) మండలంలోని ముత్యంధార జలపాతం



బాధిత కుటుంబాలకు ఇన్సూరెన్స్ చెక్కులు అందిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు



# పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

- కార్యకర్తలకు అండగా ఉంటా
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు, జనవరి 4 : సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జీకే తండా, వెంకటాపురం గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు రూ.4 లక్షల ఇన్సూరెన్స్ చెక్కులు అందజేసి మాట్లాడారు. కార్యకర్తలు ఇబ్బందులుంటే వెంటనే సమాచారమివ్వాలని, నమ్ముకున్న వారికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దేశంలో పార్టీ కార్యకర్తలను అన్ని విధాలా కాపాడుతున్న ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అని అన్నారు. కొద్ది రోజుల్లోనే గ్రామ, మండల, జిల్లాతో పాటు అనుబంధ కమిటీలను వేస్తామన్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో మున్సిపాలిటీ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించినా నిధులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ పార్టీకి పెట్టింది పేరని అన్నారు. లోకల్‌బాడీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటుతుందని ఎర్రబెల్లి అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సీతారాములు ఐలయ్య, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిన్న అంజయ్య, నాయకులు సోమేశ్వరరావు, ప్రమోద్, రామచంద్రశర్మ శ్రీనివాస్‌రావు, ఉపేందర్, కృష్ణమూర్తి, అంకూస్, వెంకన్న, నాగరాజు, జనార్దన్‌రాజ్, లింగన్న గౌడ్, వీరారెడ్డి, రవి, మణిరాజ్, రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా కేంద్రం వ్యూ



# ములుగు మున్సిపాలిటీకి గ్రీన్ సిగ్నల్

- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం
- పాత బిల్లును రికాల్ చేస్తూ గవర్నర్‌కు పంపనున్న ప్రభుత్వం
- రెండు, మూడు రోజుల్లో అధికారిక ప్రకటన

ములుగు, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : ములుగు మున్సిపాలిటీకి మార్గం సుగమమైంది. శనివారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈమేరకు సానుకూల నిర్ణయం తీసుకోవడంతో మున్సిపాలిటీ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. పెండింగ్‌లో ఉన్న మున్సిపాలిటీ బిల్లును త్వరలోనే గవర్నర్ వద్దకు ఆమోదం కోసం పంపాలని తాజాగా నిర్ణయించిన నేపథ్యంలో చాలాకాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. ములుగు జీపీతో పాటు బండారుపల్లి, జీవంతరావుపల్లి, జాకారం గ్రామాలను విలీనం చేసి మున్సిపాలిటీగా ఏర్పాటు చేయనున్నారు.

### బీఆర్‌ఎస్ హయాంలోనే గెజిట్

గత కేసీఆర్ సర్కారు హయాంలోనే ములుగు మున్సిపాలిటీకి తొలి అడుగు పడింది. 2022 సెప్టెంబర్ 12న మున్సిపాలిటీగా మార్చుతూ గెజిట్ కూడా విడుదల చేశారు. ఆ తర్వాత 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మున్సిపాలిటీ ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగలేదు. మీనమేషాలు లెక్కిస్తూ కాలం గడపడంతో కాంగ్రెస్ సర్కారుపై స్థానికుల నుంచి ఆగ్రహం వ్యక్తం కావడంతో ఎట్టకేలకు స్థానిక మంత్రి సీతక్క చొరవ తీసుకొని శనివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మున్సిపాలిటీ బిల్లును గవర్నర్ వద్దకు పంపేలా కృషి చేశారు. 2024 ఫిబ్రవరిలో సర్పంచ్ పదవీ కాలం పూర్తయిన వెంటనే ములుగు గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సాంకేతిక కారణాలను చూపుతూ మున్సిపాలిటీ ఏర్పాటును ఆలస్యం చేస్తూ వచ్చింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో ములుగు, జీవంతరావుపల్లి, బండారుపల్లి గ్రామాలను కలుపుకొని 20వార్డులతో మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలని గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం జాకారం గ్రామ పంచాయతీని సైతం మున్సిపాలిటీలో విలీనం చేయడంతో వార్డుల సంఖ్య పెరగనున్నది. మున్సిపాలిటీ కోసం గత ప్రభుత్వం రూపొందించిన పాత బిల్లును రికాల్ చేస్తూ క్యాబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపింది. రెండు, మూడు రోజుల్లో అధికార ప్రక్రియ పూర్తి కాగానే ములుగు మున్సిపాలిటీగా అవతరించనున్నది.

# కలెక్టర్ చెప్పినా కదలని ధాన్యం

*ఆరుగాలం శ్రమించి సాగుచేసిన రైతులకు ఆ పంటను అమ్ముకునేదాకా కష్టాలు తప్పడం లేదు. మొన్నటిదాకా ఓ వైపు అకాల వర్షాలతో చేతికొచ్చిన వడ్లు తడిసి ఆగమైన అన్నదాతకు ఇప్పుడు కొనుగోళ్లూ పెద్ద సమస్యగా మారింది. అధికారుల నిర్లక్ష్యంతో కాంటాలు కాక చాలామంది రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సి వస్తున్నది. ఇటీవల కలెక్టర్ స్వయంగా బయ్యారం, గార్ల, డోర్నకల్‌లోని కొనుగోలు కేంద్రాలకు వెళ్లి త్వరగా ధాన్యం తరలించాలని ఆదేశించినా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కొనుగోళ్లు పూర్తయినా ధాన్యం డబ్బులు ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.*

*– మహబూబాబాద్, జనవరి 4(నమస్తే తెలంగాణ)*

- పాలనాధికారి ఆదేశించినా పట్టించుకోని అధికారులు
- కాంటాలు పెట్టి రోజులు గడుస్తున్నా ప్రయోజనం శూన్యం
- బయ్యారం, గార్ల మండలాల్లో పేరుకుపోయిన వడ్లు
- పడిగాపులు కాయలేక రైతుల ఇబ్బందులు

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. ఆర్వోలు ఇవ్వకపోవడంతో కాంటాలు కాక కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయి. నాలుగు రోజుల క్రితం స్వయంగా జిల్లా కలెక్టర్ బయ్యారం, గార్ల, డోర్నకల్ మండలాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, త్వరగా ధాన్యాన్ని లిఫ్ట్ చేయాలని ఆదేశించారు. అయినా కూడా పౌర సరఫరాల, సహకార శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల బయ్యారం, గార్ల మండలాల్లో ఎక్కడి ధాన్యం అక్కడే అన్నట్లుంది పరిస్థితి. మిల్లుల్లో ధాన్యం పూర్తిగా నిండిపోవడంతో పెట్టేందుకు స్థలం లేక ఆర్వోలు ఇవ్వడం లేదు. ఒక లారీ లోడు చేసుకొని పోతే మిల్లులో దించేందుకు మూడు నాలుగు రోజులు పడుతుంది. దీంతో రవాణా కాంట్రాక్టర్లు సైతం లారీలు పెట్టేందుకు ఇష్టపడడం లేదు. ఇటు ధాన్యం కాంటాలు కాకపోవడంతో రైతులు కేంద్రాల వద్దనే పడిగాపులు కాస్తున్నారు. జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే తాము రోజుల తరబడి కేంద్రాల వద్ద ఉండాల్సి వస్తున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మిగిలిన మండలాల్లో ఈ సమస్య కాస్త ఊరటనిచ్చినా, చివరికి వరి కోతలు వచ్చే గంగారం, కొత్తగూడ, గూడూరు, బయ్యారం, గార్ల మండలాల్లో సమస్య తీవ్రంగా ఉంది. కొంతమంది రైతుల ధాన్యం కళ్లంలోనే ఉండగా, మరికొంత మంది రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మగ్గుతోంది. దీనికి తోడు ఇటీవల రెండు రోజులు వర్షాలు పడడంతో రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. చాలామంది రైతుల ధాన్యం తడవడంతో వారు తిరిగి ఆ ధాన్యాన్ని ఆరబెట్టి మళ్లీ కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన అధికారులు చేతులెత్తేశారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



గార్ల మండలం సీతంపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు

***ధాన్యం చెల్లింపులూ ఆలస్యమే***

మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 29,026 మంది రైతుల నుంచి రూ.309.99 కోట్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో ఇప్పటివరకు 20,223 మంది రైతులకు రూ.213.64 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా 8,803 మంది రైతులకు సంబంధించి రూ.96.35 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఒక్కో రైతు ధాన్యం అమ్మిన తర్వాత వారి ఖాతాలో డబ్బులు పడాలి అంటే పది నుంచి 15 రోజులు పడుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా వెనువెంటనే ధాన్యం డబ్బులు చెల్లించాలని రైతులకు కోరుతున్నారు.

### 20 రోజులైనా పైసలు రాలే



నాకున్న మూడు ఎకరాలతో పాటు 12 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేసిన. ప్రభుత్వం కింటాకు రూ.500 బోనస్ ఇస్తామంటే ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోస్తే 20 రోజుల తర్వాత కాంటా పెట్టారు. కాంటా పెట్టి 18 రోజులైనా పైసలు ఇయ్యలే. 15 ఎకరాల్లో 563 బస్తాలకు 225 క్వింటాళ్ల వడ్లకు రావాల్సిన పైసలు బ్యాంకులో ఏయలే. *– మంద వీరన్న, రైతు, నర్సింహులపేట*

### బోనస్ డబ్బులు రాలే..



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో 25 రోజుల క్రితం 273 బస్తాలు, 110 క్వింటాళ్ల కాంటాలో పెట్టారు. 15 రోజుల తర్వాత ధాన్యం డబ్బులు పడ్డాయి. ఇప్పటివరకు బోనస్ పడలేదు. సుమారు 55వేల రూపాయల బోనస్ రావాల్సి ఉంది. *– మహిపాల్‌రెడ్డి, రైతు, రామంజపురం*